TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

సంపుటి : 1 సంచిక :151 prajadivvs57@gmail. com సోమవారం 20 ఏప్రిల్ 2026 ఎడిటర్: ఎస్ ఎన్ డి మౌనిక రవికుమార్ పేజీలు : 4 వెల : 3/-


విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని వెలియజేస్తూ... విలువలతో కూడిన జవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతాయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా...? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9440060406

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టర్‌లు కావలెను...

## జలధార కింద అన్ని ఆలయాల పుష్కరిణిల్లో నీరు నింపాలి: చంద్రబాబు



: భూగర్భ జలాలు పెరిగితే విద్యుత్ భారం తగ్గుతుందని ఎపి సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. విద్యుత్ భారం తగ్గితే ఆ నిధులను ఇతర కార్యక్రమాలకు వాడవచ్చునని అన్నారు. ఈ సందర్భంగా జలధార-హారతి కార్యక్రమంపై చంద్రబాబు టెలీ కాన్ఫరెన్స్ జరిపారు. క్షేత్రస్థాయిలో జలధార-జలహారతి పనులను సిఎంకు అధికారులు వివరించారు. 'జలధార' కు అన్నమయ్య కలెక్టర్ ను నోడల్ అధికారిగా నియమించారు. జలధార కింద అన్ని ఆలయాల మిగతా2లో...

## నేడే కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ..



యావత్ తెలంగాణ ప్రజానీకం ఆసక్తిగా ఎదురుచూస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ 'ప్రజా ఆశీర్వాద సభ'కు సర్వం సిద్ధమైంది. కాంగ్రెస్‌ను వీడి కారెక్కుతున్న సీనియర్ నేత జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించే ఘట్టానికి సభా ప్రాంగణం ఏర్పాట్లు పూర్తయ్యాయి. రేపు(సోమవారం) సాయంత్రం 4:45 గంటలకు ఎర్రవల్లి నివాసం నుండి హెలికాప్టర్‌లో కేసీఆర్ జగిత్యాలకు బయలుదేరుతారు.జగిత్యాల కలెక్టరేట్ వద్ద ఉన్న హెలిప్యాడ్‌లో దిగి, అక్కడి నుండి నేరుగా కేసీఆర్ పార్టీ కార్యాలయానికి చేరుకుంటారు. అక్కడ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ముఖ్య నాయకులతో గులాబీ బాస్ కీలక భేటీ నిర్వహిస్తారు. పార్టీ కార్యాలయం నుంచి సాయంత్రం 6 గంటలకు మిగతా2లో...



## తుది ఒప్పందానికి బహుదూరం

### - అమెరికాతో చర్చలపై ఇరాన్

: అమెరికా, ఇరాన్ చర్చల్లో కొంత పురోగతి సాధించాయని, అయితే ఒక ఒప్పందానికి రావడానికి ఇంకా చాలా దూరం ప్రయాణిం చాల్సి ఉందని ఇరాన్ పార్లమెంటరీ స్పీకర్, ప్రధాన సంధా నకర్త మొమ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ శనివారం ప్రభుత్వ టెలివి జన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. ఇరాన్ ఓడరేవులపై అమెరికా నావికా దిగ్బంధనాన్ని కొనసాగిస్తున్న మిగతా2లో...

## ఆ ఇద్దరి పేర్లూ ఆమోదించండి

● గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై సీఎం రేవంత్‌రెడ్డి ● లోక్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ సందర్భంగా విజ్ఞప్తి



: గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా మంత్రి అజహరుద్దీన్, ప్రొఫెసర్ కోదండరామ్ పేర్లను ఆమోదించాలని సీఎం రేవంత్ రెడ్డి... రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కోరారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని లోక్ భవన్‌లో గవర్నర్‌ను కలిసి విన్నవించారు. ప్రస్తుతం అసెంబ్లీ, మండలి.. ఏ సభలోనూ అజహరుద్దీన్ సభ్యుడిగా లేరు. ఈ నేపథ్యంలో ఆయన పేరును వెంటనే ఆమోదించాలని సీఎం... గవర్నర్‌కు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. ఆయన మంత్రి పదవిని చేపట్టి ఈ నెలాఖరుకు ఆర్నెల్లు పూర్తవుతుంది. నిబంధనల ప్రకారం మంత్రి పదవి చేపట్టిన ఆరు నెలల్లోపే ఏదో ఒక సభలో సభ్యుడిగా ఎన్నుకోబడాలి లేదంటే నియమించబడాలి. కానీ అజహరుద్దీన్ విషయంలో ఈ రెండూ జరగలేదు. అందువల్లే సీఎం అత్యవసరంగా గవర్నర్‌తో భేటీ అయినట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మిగతా2లో...



## వైఫల్యం మీదే.. దిగిపోండి

### ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగంపై విపక్షాల ఆగ్రహం

### ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు

**తొలి అక్షరం/న్యూఢిల్లీ, ఏప్రిల్ 19:** చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే రాజ్యాంగ(131వ సవరణ) బిల్లు లోక్‌సభలో వీగిపోయిన దరిమిలా ప్రధాని నరేంద్ర మోదీ జాతినుద్దేశించి చేసిన ప్రసంగం కొత్త రాజకీయ వివాదానికి దారి తీసింది. అధికారిక జాతీయ ప్రసంగాన్ని ప్రధాని మోదీ పక్షపాత రాజకీయ ప్రసారంగా మార్చివేశారని పలువురు విపక్ష నేతలు ఆరోపించారు. తామేమీ తప్పులు చేయలేదని.. బీజేపీ ప్రభుత్వమే తప్పులు చేసిందన్నారు.

మిగతా2లో...

## బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు..

### 18 మంది మృతి, ఆరుగురికి గాయాలు


2లో

## నేను కోలుకుంటున్నా.. మీ అందరి ఆదరణకు కృతజ్ఞతలు : పవన్ కల్యాణ్



తాను క్రమంగా కోలుకుంటున్నానని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తెలిపారు. హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో శనివారం ఆయనకు శస్త్రచికిత్స జరిగింది. పవన్ కల్యాణ్ కొంతకాలంగా సైనసైటిస్ సమస్యతో బాధపడుతున్నారు. సర్జరీ విజయవంతమైందని, తన ఆరోగ్యం త్వరగా కుదుటపడాలని ఆకాంక్షించిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సినీ ప్రముఖులతోపాటు యావత్ ప్రజానీకానికి ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియ జేశారు. పలువురు నేతల ట్వీట్లకు స్పందిస్తూ.. తన ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిపై మిగతా2లో...

## ఉత్తరం, దక్షిణం పేరిట విభజించే కుట్ర

మహిళలను వంచించిన కాంగ్రెస్ కూటమి

ఈ నెల 17 మహిళల చరిత్రలో చీకటి రోజు

బిల్లు వీగిపోతే ఇండి కూటమి సంబురాలు

కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే మండిపాటు


2లో



## హైదరాబాద్‌లో వడగండ్ల వాన ..

### - వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ

హైదరాబాద్‌లో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. హైదరాబాద్ , పరిసర ప్రాంతాల్లో వాతావరణం ఒక్కసారిగా చల్లపడింది. నగరంలోని పలు ప్రాంతాల్లో వడగండ్ల వర్షం కురుస్తోంది. కుత్బుల్లాపూర్ పరిసరాల్లో భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం పడుతోంది.సికింద్రాబాద్ బోయిన్ పల్లి పరిసర ప్రాంతాలలో వడగళ్ల వర్షం కురిసింది. బోయిన్ పల్లి, తిరుమలగిరి, అల్వాల్, ప్యాట్నీ, పారడైజ్, మారేడుపల్లి తదితర

## ఉద్యమకారులంతా ఒక్కతాటిపైకి రావాలి

ఉద్యమకారులు జాగృతి పార్టీ వైపు చూస్తున్నారు

కొత్త పార్టీలో చేరడానికి అన్ని జిల్లాల నుంచి నాయకులు ముందుకు వస్తున్నారు

బూర్జువా పార్టీలను వదిలి జాగృతిలో చేరండి

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలంగాణ జాగృతిలో చేరిన బోథ్ మాజీ ఎంఎల్ఏ రాథోడ్ బాపూరావు


2లో

## రేవంత్ మాటలకు ఎక్కువ.. చేతలకు తక్కువ : హరీష్ రావు



సిఎం రేవంత్ రెడ్డి పోవాలి.. 4 కోట్ల తెలంగాణ ప్రజలు మాజీ సిఎం కెసిఆర్ రావాలని కోరుకుంటున్నారని బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు తెలిపారు. రేవంత్ మొనగాడు కాదు..మోసగాడని ప్రజలందరికీ అర్థమైందని అన్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ..క్వింటాలు మీద 7 క్వింటాళ్ల తరుగు పెట్టి గోసపెడుతున్నారని రైతులు అంటున్నారని, వడ్లు కొనడం లేదని..5 కిలోల తరుగు పెడుతున్నారని విమర్శించారు. ఢిల్లీలో ముడుపులు కట్టడం..కుర్చీ కాపాడుకోవడం రేవంత్ రెడ్డి చేసేదని, రేవంత్ మాటలకు

# ఆ ఇద్దరి పేర్లూ ఆమోదించండి

(మొదటి పేజీ తరువాయి)

కె.రామకృష్ణారావు కూడా ఇదే విషయాన్ని గవర్నర్ వద్ద ప్రస్తావించారు. ఒకవేళ సీఎం చేసిన విజ్ఞప్తిని గవర్నర్ తోసిపుచ్చితే ఈనెల 30 తర్వాత అజహరుద్దీన్ తన మంత్రి పదవిని వదులుకోవాల్సి ఉంటుంది. శు క్లాతో భేటీ సందర్భంగా విద్యారంగానికి సంబంధించిన వివిధ అంశాలను ముఖ్యమంత్రి ప్రస్తావించినట్టు సీఎంవో పేర్కొంది. విద్యా సంస్థల్లో మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పించాలని గవర్నర్ ఈ సందర్భంగా సూచించారు. ఇందుకు సంబంధించి విద్యార్థులతో ప్రమాణం చేయించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. లోక్ భవన్ అవగాహన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పాఠశాలలు, కళాశాలల్లో అడ్మిషన్ల సమయంలోనే మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామనే విధంగా విద్యార్థుల నుంచి ప్రమాణపత్రం తీసుకోవాలని గవర్నర్ కోరారు. ఆయన చేసిన సూచనలన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటామని సీఎం తెలిపారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీ వేం నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# ఉత్తరం, దక్షిణం పేరిట విభజించే కుట్ర

: ఈ నెల 17వ తేదీ దేశ మహిళల చరిత్రలో ఒక చీకటి రోజుగా, బ్లాక్ డేగా మిగిలిపోతుందని, ఏఐసిసి అగ్ర నేత రాహుల్ గాంధీ నాయకత్వంలోని ఇండియా అలయన్స్ దేశంలోని మహిళలతో పాటు మొత్తం దక్షిణ భారత దేశాన్ని మోసం చేసిందని కేంద్ర కార్మిక శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే మండిపడ్డారు. మహిళలు చిరకాలంగా కోరుకుంటున్న 33 శాతం రిజర్వేషన్ బిల్లుతో పాటు, దక్షిణ దేశ రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడేలా కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ బిల్లును తీసుకునివచ్చిందని ఆమె ఆదివారం నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో గుర్తు చేశారు. జనాభా నియంత్రణ పాటిస్తున్న దక్షిణ రాష్ట్రాలకు భవిష్యత్తులో జనగణన తర్వాత అన్యాయం జరగకుండా రక్షణ కల్పించడమే ప్రధాని నరేంద్ర మోడీ ఉద్దేశమని ఆమె స్పష్టం చేశారు. అయితే లోక్‌సభలో ఈ బిల్లులు విఫలమైనప్పుడు కాంగ్రెస్, ఇండీ అలయెన్స్ పార్టీల నాయకులు దేశ ప్రయోజనాలను మరిచి, ఆ వైఫల్యాన్ని పండుగలా జరుపుకున్నారని వారి నవ్వులు, హగ్‌లు దేశాన్ని ఉత్తర-దక్షిణిగా విభజించే కుట్రకు నిదర్శనమని కేంద్ర మంత్రి శోభ మండిపడ్డారు. దక్షిణ భారతానికి న్యాయం చేసే ఉద్దేశంతో కేంద్ర హోంమంత్రి అమిత్ షా లోక్‌సభలో మాట్లాడుతూ ప్రతి రాష్ట్రానికి 50 శాతం సీట్లు పెంచుతామని, కేవలం ఒక గంట సమయం ఇస్తే కొత్త బిల్లును తీసుకుని వస్తామని ప్రతిపాదించినప్పటికీ, కాంగ్రెస్, ఇండీ అలయన్స్ పార్టీలు దాన్ని తిరస్కరించాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం తమ రాజకీయ లాభాల కోసం, భవిష్యత్తులో ప్రాంతీయ విభేదాలను మరింత పెంచేలా వారు వ్యవహరించారని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో గత పదేళ్లుగా మహిళా సాధికారతకు పెద్ద పీట వేశామని విద్య, స్కాలర్‌షిప్‌లు, బీమా పథకాలతో పాటు ముద్ర లోన్లలో 60 శాతం, ఎంఎస్ఎంఇ సబ్సిడీల్లో 53 శాతం మహిళలకే అందించామని పేర్కొన్నారు. ప్రధానిగా ఎబి వాజపేయి ఉన్నప్పుడు స్వయం సహాయక సంఘాల ఆలోచనను విస్తరించి, ఇప్పుడు 3 కోట్లకు పైగా మహిళలను 'లఖ్ పతి దీదీలు'గా తీర్చిదిద్దిన ఘనత తమ ప్రభుత్వానిదేనని, మహిళ చేతిలో డబ్బు ఉంటే కుటుంబానికి, దేశానికి మేలు జరుగుతుందని ఆమె అన్నారు. నేటి మహిళలు రక్షణ రంగంలో ఫైటర్ జెట్‌లు నడుపుతూ దేశానికి సేవ చేస్తున్నారని, అయినప్పటికీ రాజకీయాల్లో వారికి సరైన అవకాశాలు రాకుండా కాంగ్రెస్ వంటి పార్టీలు అడ్డుకుంటున్నాయని మండిపడ్డారు. మోదీ ప్రభుత్వంలో ముద్ర లోన్లలో 63-64 శాతం మహిళలకే దక్కాయని, ఎంఎస్ఎంఈ సబ్సిడీలు 53 శాతానికి పైగా మహిళలు పొందారని స్పష్టం చేశారు. కర్నాటక కోస్టల్ ప్రాంతంలోని మత్స్యకార మహిళల జీవనశైలిని ఉదాహరణగా చూపుతూ, మహిళల చేతిలో ఆర్థిక శక్తి ఉంటే నిర్ణయాధికారం ఎలా మారుతుందో ఆమె వివరించారు. కాంగ్రెస్‌లో వారసత్వ రాజకీయాలు కాంగ్రెస్‌లో మహిళలకు అవకాశం అంటే అది కేవలం ఇందిరా, సోనియా, ప్రియాంక గాంధీ వంటి ఒకే కుటుంబానికి పరిమితమని విమర్శించారు. దేశంలోని తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, కర్నాటక, తమిళనాడు, కేరళలలో సీట్లు పెంచే ప్రతిపాదనను అడ్డుకోవడం ద్వారా ఇండియా కూటమి దక్షిణ భారతాన్ని మోసం చేసిందని ఆమె ఆరోపించారు. ముఖ్యంగా నియోజకవర్గాల పునర్విభజన వల్ల తెలంగాణలో ఎంపీ సీట్లు 17 నుండి 26కు, ఆంధ్రప్రదేశ్‌లో 25 నుండి 38కి పెరుగుతాయని, ఈ ప్రయోజనాన్ని ఇండీ కూటమి అడ్డుకుందని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకత్వం గురించి మాట్లాడుతూ, ఆ పార్టీలో కేవలం 'ఖాన్దాన్' (వారసత్వ) రాజకీయాలే నడుస్తాయని, జార్కిహోళి కుమార్తెకు టికెట్ ఇవ్వడాన్ని ఆమె ఉదహరించారు. రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో తనను తాను 'జాదూగర్' (మాంత్రికుడు) అని సంబోధించుకుంటూ అపరిపక్వంగా ప్రవర్తించారని ఆమె విమర్శించారు. సిఎంపై నిప్పులు చెరిగిన శోభ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై, ప్రజలకు చేసిన అన్యాయం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఆమె నిప్పులు చెరిగారు. గత ఎన్నికల సమయంలో మహిళలకు రూ. 2500 ఆర్థిక సాయం, విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, ఆసరా పెన్షన్ల పెంపు, పెళ్లైన ఆడబిడ్డలకు తులం బంగారం వంటి ఏ ఒక్క హామీని కూడా కాంగ్రెస్ అమలు చేయలేదని మండిపడ్డారు. ప్రజలకు అబద్ధపు హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకుని మోసం చేయడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని విమర్శించారు. చివరగా తెలంగాణ ముఖ్యమంత్రి కేవలం హైకమాండ్‌ను సంతోషపెట్టడానికే ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, హామీల అమలులో విఫలమై రాష్ట్ర ప్రజలను 'పిక్ పాకెట్' చేస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు. విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు, ఎంపీ డికె అరుణ పాల్గొన్నారు.

# ఉద్యమకారులలరా ఒక్కతాటిపైకి రావాలి

: ప్రజలకు సేవ చేసేందుకు అడ్డంకిగా ఉన్న బూర్జువా పార్టీలను వదిలేసి కొత్త రాజకీయ శక్తిగా రాబోతున్న జాగృతిలో చేరాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమకారులు జాగృతి పార్టీ వైపు చూస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పని చేసిన నాయకులంతా ఇప్పుడు తెలంగాణ అభివృద్ధి కోసం ఒక్కతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. కొత్త పార్టీలో చేరడానికి అన్ని జిల్లాల నుంచి నాయకులు ముందుకు వస్తున్నారని చెప్పారు. బోథ్ మాజీ ఎంఎల్ఎ, కాంగ్రెస్ నాయకుడు రాథోడ్ బాపూరావు ఆదివారం తన అనుచరులతో కలిసి తెలంగాణ జాగృతిలో చేరారు. కల్వకుంట్ల కవిత ఆయనకు కండువా కప్పి జాగృతిలోకి ఆహ్వానించారు. 2007లో కుటుంబంతో సహా తాను బోథ్‌కు వెళ్లి అక్కడి ఆదివాసీలు, గిరిజనుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయించానని గుర్తు చేసుకున్నారు. వాన పడితే ఆదివాసీ గూడాలు, మన్నెం జ్వర పీడితులతో నిండి ఉండేదని.. ఆ పరిస్థితి నుంచి మార్పు రావాలనే తెలంగాణ సాధించుకోవాలని అందరం ఐక్యంగా ఉద్యమించామని గుర్తు చేశారు. ఏ స్పిరిట్ తో రాష్ట్ర సాధన కోసం ఉద్యమించామో ఇప్పుడు రాష్ట్ర పునర్నిర్మాణం కోసం అదే స్ఫూర్తితో పని చేయాల్సి ఉందన్నారు. రాథోడ్ బాపూరావు ఉద్యోగాన్ని వదులుకుని తెలంగాణ ఉద్యమంలో పని చేశారని చెప్పారు. ఆయన తెలంగాణ జాగృతి నుంచే బిఆర్ఎస్‌లో చేరి రెండు సార్లు ఎంఎల్ఎ అయ్యారని.. ఇప్పుడు కొత్తగా ఏర్పాటు చేయబోయే పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కొత్త పార్టీకి ఆదరణ ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సిరిసిల్ల జిల్లా నుంచి బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు సహా పలువురు నాయకులు జాగృతిలో చేరారని అన్నారు. ఆదివాసీల మతం కోసం ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలి జనగణనలో ఆదావాసీల మతం కోసం ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలని కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు.

ఆల్ ఇండియా ఆదివాసీ కాన్‌స్టిట్యూషన్ రైట్స్ అండ్ కల్చరల్ ప్రొటెక్షన్ జెఎసి జాతీయ అధ్యక్షుడు, ఖమ్మం జెడ్‌పి మాజీ చైర్మన్, మాజీ ఎంఎల్ఎ చందా లింగయ్య దొర ఆధ్వర్యంలో జెఎసి నాయకులు ఆదివారం జాగృతి కార్యాలయంలో కవితతో భేటీ అయ్యారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలతో ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను చందా లింగయ్య దొర ఈ సందర్భంగా వివరించారు.

కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం పెసా చట్టానికి తూట్లు పొడుస్తూ ఆదివాసీల హక్కులను హరిస్తోందని అన్నా రు. రాజ్యాంగంలోని 5, 6 షెడ్యూళ్లలో ఆదివాసీలకు ఉన్న రక్షణలను తొలగిస్తోందని పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో వడగండ్ల వాన ..

(మొదటి పేజీ తరువాయి)

వర్షం కురిసింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్లోని వివిధ ప్రాంతాల్లో వడగండ్ల వాన కురుస్తోంది. కూకట్‌పల్లి, మూసాపేట్, జేఎన్‌టీయూ , నిజాంపేట్, కేపీహెచ్‌బీకాలనీ, ప్రగతి నగర్ బాచుపల్లి తదితర ప్రాంతాల్లో సాయంత్రం అకస్మాత్తుగా వడగళ్ల వాన కురిసింది. వేడి వాతావరణం కొనసాగుతున్న సమయంలో ఒక్కసారిగా గాలివానతో పాటు వడగళ్ల వర్షం పడటంతో ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ వర్షం కారణంగా వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉరుములు, గాలులతో కూడిన వర్షాలు, వడగళ్ల వానలు సంభవిస్తున్నాయని, వచ్చే కొన్ని గంటలు కూడా ఇలాంటి పరిస్థితులు కొనసాగే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రజలు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చింతల్, పద్మనగర్‌లో గాలి వాన ధాటికి వేర్లతో సహా భారీ వృక్షం కూలింది. చెట్టు దాటికి రెండు కరెంట్ స్తంభాలు నేలకొరిగాయి. పలు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. దీంతో రహదారులపైకి వాన నీరు చేరి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఔటర్ రింగ్ రోడ్ పరిసరాల్లోనూ భారీవర్షమే పడింది. కొన్నాళ్లుగా భానుడి భగభగలతో అల్లాడిపోతున్న నగరవాసులకు ఈ వర్షం ఉపశమనం కలిగించింది. ఉక్కపోతతో నగర ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వాతావరణం చల్లబడి ఏకధాటిగా వర్షం కురవడంతో ప్రజలు స్వాంతన పొందారు.

# రేవంత్ మాటలకు ఎక్కువ.. చేతలకు తక్కువ : హరీష్ రావు

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కువ..చేతలకు తక్కువని ఎద్దేవా చేశారు. ఎస్ఎల్ బిసిలో మృతదేహాలను బయటకు తీయని దద్దమ్మ రేవంత్ రెడ్డి ప్రభుత్వమని, రైతుబంధు రూ. 15 వేలు, బోనస్ ఇస్తామన్నారని ఇచ్చారా? అని ప్రశ్నించారు. రైతు డిక్లరేషన్ పై రాహుల్ గాంధీ పెదవి మూసుకున్నారని, రుణమాఫీపై మొదటి సంతకం అన్నారని.. దేవుళ్లపై భద్రాద్రి రాములు, యాదాద్రి లక్ష్మీనర్సింహ స్వామి, మెదక్ చర్చిలపై ఒట్టు పెట్టారని మండిపడ్డారు. వంద రోజుల్లో రుణమాఫీ చేస్తామని చెప్పారని, బ్యాంకుల అకౌంట్లు విలీనం కాకుండా రైతులకు రుణమాఫీలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ మాటలు నమ్మి డబ్బులు కట్టి మోసపోయారని, అసెంబ్లీలో రుణమాఫీపై నిలదీస్తే అయిందని అబద్దాలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ వచ్చాక 4 రైతుబంధు వచ్చాయని..ఒక్క రైతుబంధే వేశారని.. రెండు విడతల రైతుబంధు ఎగ్గొట్టారని, గత యాసంగికి ఇవ్వలేదని హరీష్ రావు దుయ్యబట్టారు.

# కేసుల భయంతో బానిసలా బతుకాలా..?..

## - సోదరుడు జగన్‌పై వైఎస్ షర్మిల విమర్శలు



దత్తపుత్రుడు జగన్ తెర తొలగిందని, బీజేపీతో పెట్టుకున్న అక్రమ పొత్తు తేటతెల్లమైందని ఆయన సోదరి, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. విపక్షం ముసుగులో ఉన్న వైఎస్సార్సీపీ సైతం ఆర్ఎస్ఎస్ పక్షమేనని నిజ నిర్ధారణ జరిగిందని అన్నారు. బిల్లులను అడ్డుకున్న ప్రతిపక్ష పార్టీలు ఏం సాధించాయి..? అని వైసీపీ అధినేత జగన్ ప్రశ్నించడంపై ఆమె స్పందించారు. టీడీపీ, జనసేనలను మించి మోదీని ఇంతలా మోయాలా..? మన దేశ రాజ్యాంగ పరిరక్షణ కంటే బీజేపీ భజనే ముఖ్యమా..? అని ప్రశ్నించారు. అక్రమ డీ లిమిటేషన్ బిల్లుపై ఎన్‌డీఏ పక్షాన నిలబడ్డందుకు జగన్ సిగ్గుపడాలని షర్మిల అన్నారు.

# జలధార కింద అన్ని ఆలయాల పుష్కరిణిల్లో నీరు నింపాలి: చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

పుష్కరిణిల్లో నీరు నింపాలని, అర్బన్ మండలాల్లో నోడల్ అధికారులుపర్యవేక్షించాలని చంద్రబాబు సూచించారు. నీటి సంరక్షణలో అన్నయ్య జిల్లా మోడల్ ప్రతిచోటా అమలు కావాలని, జలధార-జలహారతిలో ప్రజలను భాగస్వాములు చేయాలని చంద్రబాబు పేర్కొన్నారు.

# నేడే కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ..

(మొదటి పేజీ తరువాయి)

భారీ ర్యాలీగా కేసీఆర్ సభా ప్రాంగణానికి వెళ్తారు. అనంతరం జీవన్ రెడ్డికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానిస్తారు.

# తుది ఒప్పందానికి బహుదూరం

(మొదటి పేజీ తరువాయి)

నేపథ్యంలో పదేపదే విశ్వాస ఉల్లంఘనలు జరుగుతున్నాయని పేర్కొంటూ శనివారం హెర్మూజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. దీనికి ముందు హెర్మూజ్ జలసంధి గుండా సురక్షితంగా ప్రయాణించడానికి నౌకలు రుసుము చెల్లించాలని ఇరాన్ ఒత్తిడి చేసింది. రుసుము చెల్లించే నౌకలకు చెల్లించని వాటి కంటే ప్రాధాన్యత ఉంటుందని ఒక సీనియర్ ఇరాన్ అధికారి సీఎన్ఎన్‌కి తెలిపారు. ఈ చర్య అమెరికాతో చర్చలను క్లిష్టతరం చేసినప్పటికీ హెర్మూజ్ జలసంధిలోని పరిస్థితిని ఘాలిబాఫ్ ఇరాన్‌కు ఒక వ్యూహాత్మక విజయంగా అభివర్ణించారు. శత్రువును మేము నాశనం చేయలేదు. వారి వద్ద ఇప్పటికీ డబ్బు, ఆయుధాలు ఉన్నాయి. కాని వ్యూహాత్మకంగా మా చేతిలో వారు ఓటమి పాలయ్యారు అని ఘాలిబాఫ్ వ్యాఖ్యానించారు. చర్చలు కొనసాగుతున్నప్పటికీ కీలకమైన విభేదాలు ఇంకా పరిష్కారం కాలేదని, అందువల్ల ఏదైనా పురోగతి సాధించడానికి ఇంకా చాలా సమయం పడుతుందని ఆయన సూచించారు. చర్చల్లో చాలా అంతరాలు ఉన్నాయని, తుది షరతులపై చర్చించే దశకు ఇరు పక్షాలు ఇంకా చేరుకోలేదని ఆయన చెప్పారు. **మా అణు హక్కులను కాదనడానికి ట్రంప్ ఎవరు?** ఇరాన్ అణు హక్కులను నిరాకరించే అధికారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు లేదని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ అదివారం స్పష్టం చేశారు. సమీపిస్తున్న కాల్పుల విరమణ గడువుకు ముందు అమెరికా, ఇరాన్ మధ్య ప్రతిష్ఠంభన కొనసాగుతున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. మేం అణు హక్కులను వినియోగించుకోకూడదని ట్రంప్ ఆదేశిస్తున్నారు. అది ఏ నేరానికి అనేది చెప్పడం లేదు. ఒక దేశం హక్కులను హరించడానికి ఆయన ఎవరు? అని జెష్కియన్ అన్నట్లు ఐఎస్ఎన్ఏ వార్తా సంస్థ పేర్కొంది.

# వైఫల్యం మీదే.. దిగిపోండి

(మొదటి పేజీ తరువాయి)

ప్రజల ఆకాంక్షలకు ప్రాతినిధ్యం వహించని ఆ పార్టీ అధికారంలోంచి దిగిపోవాలని వారు డిమాండ్ చేశారు. గత 12 ఏండ్లుగా చెప్పుకోదగ్గదేమీ సాధించలేక, నిరాశ నిస్పృహలకు లోనైన మోదీ జాతిని ఉద్దేశించి చేసే అధికారిక ప్రసంగాన్ని బురద జల్లుడు, పచ్చి అబద్ధాలతో నిండిన రాజకీయ ప్రసంగంగా మార్చారని కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు ఖర్గే విమర్శించారు. తృణమూల్ అధినాయకురాలు, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ స్పందిస్తూ.. ప్రతిపాదిత నియోజకవర్గాల పునర్విభజన(డీలిమిటేషన్) ప్రక్రియ, మహిళా రిజర్వేషన్లపై ప్రధాని ప్రజలను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ల బిల్లును లోక్‌సభలో ఆమోదింపచేయడంలో విఫలమైన కారణంగా ఎన్డీయే ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు ప్రాతినిధ్యం వహించలేదనే విషయం స్పష్టమైందని సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ వ్యాఖ్యానించారు. అందువల్ల కేంద్రంలో అధికారంలో కొనసాగే హక్కు ఆ కూటమికి లేదన్నారు. ప్రధాని తన ప్రసంగం ద్వారా అసెంబ్లీ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని సీపీఐ ఎంపీ పీ సంతోష్ కుమార్ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు ఆదివారం లేఖ రాశారు. దీనిపై ఈసీఐ వెంటనే జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు. దూరదర్శన్, సంసద్ టీవీ వంటి ప్రజా వేదికలపై ఆ ప్రసంగాన్ని ప్రసారం చేయడం ప్రభుత్వ వనరుల దుర్వినియోగానికి పాల్పడడమేనని ఆయన ఆరోపించారు.

# బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు..

తమిళనాడులోని విరుధునగర్ జిల్లా కట్టనర్‌పట్టి గ్రామంలో ఆదివారం ఓ బాణసంచా ఫ్యాక్టరీలో భారీ పేలుడు సంభవించి 18 మంది మరణించగా, ఆరుగురు గాయపడ్డారు. ఫ్యాక్టరీ లోపల ఫ్యాన్సీ టపాసులకు గొలుసులు అతికించడంలో 30 మంది కార్మికులు నిమగ్నమై ఉన్న సమయంలో ఈ పేలుడు సంభవించినట్లు తెలిసింది. పేలుడు ధాటికి భవనంలో కొంత భాగం కూలిపోయింది. గోవిందపల్లూరుకు చెందిన ముత్తు మాణిక్కం అనే వ్యక్తి ఈ ఫ్యాక్టరీ నిర్వహిస్తున్నట్లు తెలిసింది. పేలుడుతో ఆ ప్రాంతంలో భయాందోళన నెలకొన్నది. సహాయక చర్యల కోసం అత్యవసర బృందాలు ఘటనా స్థలికి చేరుకున్నాయి. క్షతగాత్రులను వెంటనే విరుధునగర్‌లోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కాగా పేలుడు ఘటనపై ముఖ్యమంత్రి స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు.

# నేను కోలుకుంటున్నా.. మీ అందరి ఆదరణకు కృతజ్ఞతలు : పవన్ కల్యాణ్

(మొదటి పేజీ తరువాయి)

ఆయన సోదరుడు, మెగాస్టార్ చిరంజీవి ఎక్స్ వేదికగా స్పందించారు. కల్యాణ్ బాబుకు వైద్య ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని, ప్రస్తుతం ఆయన క్షేమంగా, నిలకడగా కోలుకుంటున్నారని చిరంజీవి చెప్పారు. వైద్యుల సూచన మేరకు సాధారణ కార్యకలాపాల్లోకి తిరిగి రావడానికి సుమారు వారం రోజులు పట్టవచ్చునని తెలిపారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. 'మీ అందరి ప్రేమకు, ప్రార్థనలకు ధన్యవాదాలు' అని చెప్పారు. దీనికి పవన్ కల్యాణ్ స్పందిస్తూ.. 'ధన్యవాదాలు అన్నయ్య. మీ ప్రేమ, ఆశీస్సులు, నిరంతర సంరక్షణకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. మీ మాటలు వెచ్చదనాన్ని, రక్షణను, బలాన్ని ఇస్తాయి. మీ ఆశీస్సులతో త్వరలోనే కోలుకుని తిరిగి ప్రజాసేవకు వస్తాను' అని బదులిచ్చారు. మరో సోదరుడు, జనసేన ఎమ్మెల్సీ నాగబాబు కూడా పవన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మన ప్రియతమ నాయకుడు పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స విజయవంతమైందని, ఆయన కొన్ని రోజులు విశ్రాంతి తీసుకుని, నూతన శక్తితో తిరిగి వస్తారని పేర్కొన్నారు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని మనమందరం ప్రార్థిద్దామని పోస్ట్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి కూడా పవన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. దీనికి పవన్ స్పందిస్తూ.. నా ఆరోగ్యం కోసం మీరు తెలిపిన శుభాకాంక్షలకు ధన్యవాదాలు వైఎస్ జగన్ గారూ.. నేను క్రమంగా కోలుకుంటున్నా అని పేర్కొంటున్నారు. మీ ఆదరణకు కృతజ్ఞుడను అని బదులిచ్చారు. అదేవిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, భూపతిరాజు శ్రీనివాస వర్మ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, నారాయణ, అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తదితరులు పవన్ కల్యాణ్ కోలుకోవాలని తమ సందేశాల్లో పేర్కొన్నారు.

# ఒమాన్ గల్ఫ్ దేశంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు

**ముస్తాబాద్/ ఏప్రిల్ 19 ప్రజా దివాస్** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవా సమితి ఇంటర్నేషనల్ వ్యవస్థాపక అధ్యక్షులు గాలి గాని రాజు ఆధ్వర్యంలో ఒమాన్ లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 135 వ జయంతి వేడుకలను చిత్రపటానికి పూలమాలలు వేసి స్వీట్లు పంచుకొని ఘనంగా ఒమాన్ గల్ఫ్ దేశంలో జయంతి వేడుకలు నిర్వహించడం జరిగినది ముఖ్య అతిథులు సుల్తాన్ ఆఫ్ ఒమాన్ ఇండియన్ ఎంబసీ అంబాసిడర్ జీవి శ్రీనివాస్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ పాలు పంచుకోవాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సబ్బండ వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన మేధావి అని కొనియాడారు ఈ కార్యక్రమంలో తెలంగాణ సమితి అధ్యక్షులు లక్ష్మణ్ కల్చర్ సెక్రటరీ రవి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవా సమితి ఇంటర్నేషనల్ ఫౌండర్ అండ్ చైర్మన్ మహిళా చైర్మన్ అంజలి రెడ్డి ఒమన్ వైస్ ప్రెసిడెంట్ రంజిత్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవాసమితి ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ గంగ స్వామి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవా సమితి ఇంటర్నేషనల్ సాలాల వైస్ ప్రెసిడెంట్ రాకేష్ మాజీ ప్రెసిడెంట్ గిరి డాక్టర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ మిషిన్ సందీప్ ఉమన్ అంబాసిడర్ జీవి శ్రీనివాస్ మాట్లాడుతూ అంబేద్కర్ 135 వ జయంతి ఘనంగా నిర్వహించినందుకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవాసమితి ఇంటర్నేషనల్ ఒమన్ కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపినారు ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ చేసుకోవాలని తెలిపినారు తెలంగాణ విన్ అధ్యక్షులు లక్ష్మణ్ రవి శుభాకాంక్షలు కల్చర్ సెక్రటరీ రవి జయంతి కార్యక్రమానికి వచ్చిన వారికి శుభాకాంక్షలు తెలిపినారు చైర్మన్ గాలిగాని రాజు మాట్లాడుతూ జయంతి



కార్యక్రమానికి వచ్చిన భీమ్రావు సేవాసమితి మదర్ తెరిసా సేవాసమితి తెలుగు మహిళ సేవా సమితి తెలుగు గల్ఫ్ కమ్యూనిటీ ఒమాన్ సభ్యులకు దూర ప్రాంతాల నుండి వచ్చిన తెలుగు ప్రజలకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతూ డాక్టర్ భీమ్రావు అంబేద్కర్ 135 వ జయంతి నిర్వహించడం చాలా సంతోషకరమైన విషయం కానీ కొనియాడారు ఒమాన్ కమిటీ సభ్యులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవాసమితి ఇంటర్నేషనల్ వ్యవస్థాపక అధ్యక్షులు గాలిగాని రాజు మహిళా చైర్మన్ అంజలి రెడ్డి వైస్ ప్రెసిడెంట్ రంజిత్ సెక్రటరీ ఎల్లయ్య కోశాధికారి మహేందర్ ఇంచార్జ్ రాజలింగం విక్రమ్ శ్రీనివాస్ విజయ్ కుమార్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవా సమితి గల్ఫ్ సోషల్ మీడియా ఇన్చార్జ్ రమేష్ వాసంగి బేబీ ఇంద్రాణి నాగమణి తదితరులు అధిక సంఖ్యలో వచ్చి జయంతిలో పాల్గొని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదములు తెలిపారు

# వేములవాడ పద్మశాలి సంఘం గౌరవ సలహాదారుగా యెల్ల పోశెట్టి ఎన్నిక

**-పద్మశాలి సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం: పోశెట్టికి ధృవీకరణ పత్రం అందజేత**

**వేములవాడ/ప్రజాదివాస్ ఏప్రిల్ 19** వేములవాడ పట్టణ పద్మశాలి సంఘం నూతన పాలక వర్గాన్ని ప్యానల్ వారీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జోన్-3 పరిధిలో రెండేళ్ల కాలపరిమితికి గాను రాష్ట్ర కళాకారుల సంఘం కన్వీనర్ యెల్ల పోశెట్టిని గౌరవ సలహాదారుగా కుల బాంధవులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఎన్నికల అధికారి బూర సదానందం ఆయనకు ఎన్నిక ధృవీకరణ పత్రాన్ని అందజేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు రాంపల్లి వెంకట రమణతో పాటు పాలకవర్గ సభ్యులను కులస్థులు శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రవ ంలో 25వ వార్డు కౌన్సిలర్ కోక్కుల బాలకృష్ణ, 5వ వార్డు కౌన్సిలర్ వాసాల లావణ్య శ్రీనివాస్, పద్మశాలి కుల బాంధవులు మరియు సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. పద్మశాలి కుల అభ్యున్నతికి, ఐక్యతకు నూతన పాలకవర్గం కృషి చేయాలని ఈ సందర్భంగా పలువురు ఆకాంక్షించారు.



# సాగును పండుగ చేయడమే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లక్ష్యం: మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

**వేములవాడలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం: రైతులకు మద్దతు ధరతో పాటు అన్ని వసతులు**



**వేములవాడ/ప్రజాదివాస్ ఏప్రిల్ 19** రేపటి నుంచే రైతుల ఖాతాల్లోకి 'రైతు భరోసా' నిధులు: పుల్కం రాజుదళారులను నమ్మి మోసపోవద్దు.. ప్రభుత్వ కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలి: రైతన్నలకు పిలుపువేములవాడ నియోజకవర్గ రైతాంగం ఆర్థికంగా బలోపేతం కావాలని, సాగును పండుగలా మార్చాలన్నదే స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రధాన ఆశయమని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు. వేములవ ాడ పట్టణంలోని బాలనగర్‌లో వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పుల్కం రాజు మాట్లాడుతూ.. వేములవాడ నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు స్పష్టమైన విజన్ ఉందన్నారు. ముఖ్యంగా రైతాంగానికి సాగునీరు అందించడంలోనూ, పండించిన పంటను నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేసేలా మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడంలో ఆది శ్రీనివాస్ నిరంతరం శ్రమిస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వ విప్ హోదాలో రాష్ట్ర ప్రభుత్వం నుండి నియోజకవర్గానికి గరిష్టంగా నిధులు తీసుకువస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నారని తెలిపారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలన్న సంకల్పంతో ఊరూరా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా, ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరను పొందాలని, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన తాగునీరు, నీడ, గోనె సంచులు వంటి అన్ని వసతులను ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు అధికారులు సిద్ధం చేశారని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. రేపటి నుండే రాష్ట్రవ్యాప్తంగా రెండో విడత రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసే ప్రక్రియ ప్రారంభమవుతుందని వెల్లడించారు. ఇప్పటికే అర్హులైన రైతులకు రుణమాఫీ చేసి రైతులను రుణ విముక్తులను చేశామని, సన్న వడ్లకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తున్న ఘనత ఈ ప్రభుత్వానిదేనన్నారు. ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టులు, చెరువుల పునరుద్ధరణ పనులు వేగవంతం అయ్యాయని, దీనివల్ల వేములవాడ రైతాంగం రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎమ్మెల్యే నిత్యం ప్రజల మధ్య ఉంటూ పాలనను ప్రజల వద్దకు తీసుకువస్తున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహకార సంఘం అధికారులు, స్థానిక కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# "కార్యకర్తపై కేటీఆర్ చెరగని ప్రేమ.. తెలంగాణ సత్తెమ్మ పాడె మోసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్"

**-"తెలంగాణ ఉద్యమ బిడ్డ సత్తెమ్మ మృతి: అంత్యక్రియలకు స్వయంగా హాజరైన కేటీఆర్, చల్మెడ**

**వేములవాడ/ప్రజాదివాస్ ఏప్రిల్ 19** బీఆర్ఎస్ పార్టీ నిఖార్సైన కార్యకర్త, ఉద్యమ బిడ్డ తెలంగాణ సత్తెమ్మ మరణం పార్టీకి తీరని లోటు. తెలంగాణ ఉద్యమ కాలం నుండి నేటి వరకు పార్టీ జెండాను భుజానకెత్తుకుని నడిచిన సత్తెమ్మ ఆదివారం తుదిశ్వాస విడిచారు. ఆమె మృతి పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సత్తెమ్మ భౌతికకాయానికి కేటీఆర్, వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు తదితరులు నివాళులర్పించారు. ఆమె పాడె మోసి అంతిమ సంస్కారాల్లో స్వయంగా పాల్గొని కార్యకర్తల పట్ల తమకున్న అనుబంధాన్ని చాటుకున్నారు. గతంలో మిడ్ మానేరు ప్రాజెక్టులో తంగళ్ళపల్లి మండలం చీర్లవంచ గ్రామం ముంపుకు గురైనప్పుడు, నిరాశ్రయురాలైన సత్తెమ్మకు రగుడు గ్రామంలో డబుల్ బెడ్ రూం ఇల్లు కేటాయించి పార్టీ అండగా నిలిచిన విషయాన్ని ఈ సందర్భంగా నేతలు గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం వేములవాడ అర్బన్ మండలంలోని చీర్లవంచలో నివసిస్తున్న ఆమె కుటుంబ సభ్యులను నాయకులు పరామర్శించి ధైర్యం చెప్పారు. సత్తెమ్మ మృతి పట్ల సంతాపం తెలిపిన వారిలో తోట ఆగయ్య, తుల ఉమ, నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, హరిచరణ్ రావు, మ్యాకల రవి, రంగు రాములు, ముత్త మహేష్ మరియు ఇతర సీనియర్ నాయకులు ఉన్నారు. క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా, తెలంగాణ వాదిగా సత్తెమ్మ చేసిన సేవలు చిరస్మరణీయమని వారు కొనియాడారు.





## కారు చార్జింగ్ స్టేషన్ నా లేక గురుకుల పాఠశాలనా..?



**సిరిసిల్ల/ ఏప్రిల్ 19 ప్రజా దివాస్** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మల గ్రామంలో గల గురుకుల పాఠశాల కారు చార్జింగ్ స్టేషన్ లేక పాఠశాలన..? ఒక్క ఉపాధ్యాయుడు తన సొంత కారు ప్రతిరోజు తన సొంత ఇంటిలా కార్ చార్జింగ్ వాడుకోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు ఇలా విద్యుత్తు దుర్వినియోగం జరిగిన పట్టించుకునే నాధుడే కరువయ్యాడు ఈ సమస్యపై స్పందించకుంటే విద్యుత్ భారం గురుకుల పాఠశాల పై పడుతుందని వాపోయారు

## ముస్తాబాద్ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు హాజరు





**ముస్తాబాద్/ ఏప్రిల్ 19 ప్రజా దివాస్** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం లోని పలు అభివృద్ధి కార్యక్రమాలలో 20-04-2026 సోమవారం రోజున ప్రభుత్వ విప్ వేములవాడ శాసన సభ్యులు ఆది శ్రీనివాస్ మరియు సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జ్ కె కె మహేందర్ రెడ్డితొ కలిసి అభివృద్ధి పనులు ప్రారంభిస్తారని ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏళ్ళ బాల్రెడ్డి వివరాలు వెల్లడించారు ముస్తాబాద్ పట్టణంలోని పురాతన ఆలయమైన వేణుగోపాల స్వామి ఆలయ పునర్నిర్మాణముకై ఉదయం 9.30 గంటలకు జరిగే పూజ కార్యక్రమం లో పాల్గొంటారుముస్తాబాద్ మండలం నామాపూర్ లోని నూతనంగా నిర్మించిన ఇరిగేషన్ గెస్ట్ హౌస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో 10.00 గంటలకు పాల్గొంటారుకావున ఇట్టి కార్యక్రమానికి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా నాయకులు సీనియర్ నాయకులు ఎస్సీ సెల్ బిసి సెల్ ఎస్టి సెల్ నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు ఎన్ ఎస్ యు ఐ నాయకులు కార్యకర్తలు తప్పక హాజరు కాగలరని విజ్ఞప్తి

## ఎనగల్ గ్రామంలో ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు

**వాహనదారులు నిబంధనలు పాటించాలి: చందుర్తి ఎస్సై రమేష్**



**చందుర్తి మండలం/ ప్రజాదివాస్ ఏప్రిల్ 19** చందుర్తి మండలం ఎనగల్ గ్రామంలో ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా గ్రామంలోని ప్రధాన రహదారిపై రాకపోకలు సాగించే ప్రతి వాహనాన్ని పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై రమేష్ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాల ని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడంతో పాటు వాహనానికి సంబంధించిన పత్రాలను ఎల్లప్పుడూ దగ్గర ఉంచుకోవాలని సూచించారు. సరైన పత్రాలు లేని మరియు నంబర్ ప్లేట్లు సరిగ్గా లేని వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాల నివారణకు మరియు ప్రజల రక్షణ కోసమే ఈ తనిఖీలు చేపట్టినట్లు వెల్లడించిన ఆయన, గ్రామాల్లో కొత్త వ్యక్తులు ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలి



**ముస్తాబాద్/ ఏప్రిల్ 19 ప్రజా దివాస్** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబా ద్ మండలం లోని పలు గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని మాజీ రైతుబంధు మండల అధ్యక్షులు కల్వకుంట్ల గోపాల్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికొచ్చిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తీసుకువచ్చి రోజులు గడుస్తు వాతావరణ పరిస్థితులు అనుకూలించలేకపోవడం రైతులకు తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్నాయని ప్రభుత్వం అధికారులు వెంటనే స్పందించి మండలంలోని అన్ని గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని వేసవికాలం దుష్ట కొనుగోలు కేంద్రాలలో త్రాగునీటి వసతి ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో ఉంచాలని రైతులకు కావలసిన తూకం యంత్రాలు గోనెసంచులు హమాలీలు కొనుగోలు వేగవంతంగా నడిచేలా ఏర్పాటు చేయాలని కోరారు

## ఏలూరు ప్రజల అభిమానాన్ని మర్చిపోను..

- ఎంపీ పుట్టా మహేష్ కుమార్.
- హైదరాబాద్ డ్రగ్ కేసుతో నాకు సంబంధం లేదు.
- నేను ఏ తప్పు చేయలేదు.
- 40 రోజుల తర్వాత ఏలూరు వచ్చిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్.
- ఘన స్వాగతం పలికిన కార్యకర్తలు, అభిమానులు.





**ఏలూరు, ఏప్రిల్ 19 ఏపీ స్టేట్ ఇంచార్జ్ /ప్రజాదివాస్ :-**
తాను నిష్కళంకితుడననీ, హైదరాబాద్ డ్రగ్స్ కేసులో తన పాత్ర ఏమీ లేదని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్పష్టం చేశారు. హైదరాబాద్ లో ఒక ఫామ్ హౌస్ లో డ్రగ్స్ పార్టీకి వెళ్లారని ఆరోపణలు ఎదుర్కొన్న తరువాత ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఆదివారం తొలిసారిగా ఏలూరులో అడుగు పెట్టారు. మధ్యాహ్నం 12.40 సమయంలో ఏలూరు శాంతినగర్ లోని తన క్యాంపు కార్యాలయంకు చేరుకున్న ఎంపీకి అభిమానులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడకు వచ్చిన మీడియా ప్రతినిధులతో కొద్ది సేపు మాట్లాడిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్.. హైదరాబాద్ డ్రగ్స్ కేసులో తాను ఏ తప్పు చేయలేదని స్పష్టం చేశారు. తనపై వచ్చిన ఆరోపణలన్ని తప్పని, డ్రగ్స్ కేసు విచారణలో కడిగిన ముత్యంలా బయటకు వస్తానని ఎంపీ విశ్వాసం వ్యక్తం చేశారు. కేసు ఇంకా విచారణ దశలోనే ఉన్నందున దానిపై ఎక్కువగా మాట్లాడలేనని, మీడియా సంయమనం పాటించాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు. తాను ఏ తప్పు చేయకపోయినా మీడియాలో వచ్చిన కథనాలతో మనస్థాపానికి గురయ్యాయని చెబుతూ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా పార్టీ కార్యకర్తలు, అభిమానులు తనకు మద్దతుగా నిలిచారన్నారు. కష్ట సమయంలో తనకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు. ఏలూరు పార్లమెంటు అభివృద్ధికి అంకితమై పని చేస్తానని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్పష్టం చేశారు.

**ఎంపీ లను కలిసిన ఎమ్మెల్యేలు, నేతలు..**
దాదాపు 40 రోజుల తర్వాత ఏలూరు వచ్చిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ను టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య, ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, రోషన్ కుమార్, ధర్మరాజు, అప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, ఇతర నేతలు మర్యాదపూర్వకంగా కలిసారు.

ఎంపీకి భారీ స్వాగతం..

ఉదయం 10.40 సమయంలో గన్నవరం ఎయిర్ పోర్టుకు చేరుకున్న ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కు వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఎయిర్ పోర్టు నుంచి బయటకు రాగానే అభిమానులు పూలవర్షం కురిపించారు. వారి ప్రేమాభిమానాలతో తడిసి ముద్దైన ఎంపీ కాసేపు భావోద్వేగానికి గురయ్యారు. గన్నవరం నుంచి భారీ ర్యాలీగా ఏలూరు బయలుదేరిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెంట దాదాపు 300కు పైగా కార్లు వాహనాలతో అభిమానులు అనుసరించారు. ప్లకార్డులు, బ్యానర్లతో భారీగా తరలివచ్చిన అభిమానులు, టీడీపీ కార్యకర్తలు ఎంపీ పుట్టా కు మద్దతుగా నినాదాలు చేశారు. ఏలూరు నగరంతోపాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఎంపీ అభిమానులు, టీడీపీ కార్యకర్తలు భారీగా తరలిరావడంతో క్యాంపు కార్యాలయం ఉన్న శాంతినగర్ పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి.

## ఈ.వీ. సతీష్ కుమార్ చిత్రపటానికి నివాళులర్పించిన ఎంపీ కడియం కావ్య



**నేటి ప్రభాత సూర్య ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో ఏప్రిల్ 19**
రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఈ.వీ. శ్రీనివాస్ రావు సోదరులు ఈ.వీ. సతీష్ కుమార్ ఇటీవల మరణించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆదివారం హనుమకొండలోని ఎన్.వీ. కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన సతీష్ కుమార్ దశదినకర్మ కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య దివంగత సతీష్ కుమార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఈ.వీ. శ్రీనివాస్ రావును, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, సతీష్ కుమార్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లు బీజేపీ రాజకీయ కుట్ర: ఎంపీ డా. కడియం కావ్య

### డిలిమిటేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం..

### తెలంగాణపై అనుచిత వ్యాఖ్యలు సహించం



**/ప్రజాదివాస్ ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో ఏప్రిల్ 19**
మహిళా రిజర్వేషన్ బిల్లు ముసుగులో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం కుట్రలు చేస్తోందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య తీవ్రంగా ధ్వజమెత్తారు. ఆదివారం హన్మకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయం లో జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈసమావేశంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, మేయర్ గుండు సుధారాణి సహా పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు. అమలు చేయకుండా కాలయాపన ఎందుకు?బీజేపీది మహిళలపై కపట ప్రేమేనని ఎంపీవిమర్శించారు. "నిజంగా మహిళా సాధికారత పై చిత్తశుద్ధి ఉంటే, 2023లో ఆమోదం పొందిన బిల్లును 2024 ఎన్నికల్లోనే ఎందుకు అమలు చేయలేదు? జనగణన, డిలిమిటేషన్ పేర్లతో కాలయాపన చేస్తూ 2029 వరకు సాగదీయడం వెనుక రాజకీయ ప్రయోజనాలు దాగి ఉన్నాయి" అని ఆమె మండిపడ్డారు. వందలాది బిల్లులను హడావిడిగా పాస్ చేసిన కేంద్రం, మహిళల హక్కుల విషయంలోఎందుకు వెనుకంజ వేస్తోందని నిలదీశారు.దక్షిణాది ప్రయోజనాలను తాకట్టు పెట్టారుడిలిమిటేషన్ ప్రక్రియ ద్వారా అభివృద్ధి చెందుతున్న దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కే ప్రయత్నం జరుగు తోందని కావ్య ఆందోళన వ్యక్తం చేశారు.అన్యాయం: కుటుంబ నియంత్రణ పాటించి, దేశ జీడీపీకి అధిక వాటా ఇస్తున్న దక్షిణాదిని కేంద్రం శిక్షిస్తోంది.ఆంధ్రప్రదేశ్ తీరు: ఏపీలోని కొన్ని రాజకీయ శక్తులు బీజేపీకి తలవంచి దక్షిణాది ప్రయోజనాలను తాకట్టు పెట్టడం దురదృష్టకరం.పిలుపు: రాజ్యాంగాన్ని, సమాఖ్య స్ఫూర్తిని కాపాడటానికి అన్ని ప్రాంతీయ పార్టీలు, ప్రతిపక్షాలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.తేజస్వి సూర్య వ్యాఖ్యలపై ఘాటు స్పందనతెలంగాణపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన అనుచిత వ్యాఖ్యలను కావ్య తీవ్రంగా ఖండించారు. తెలంగాణ గౌరవాన్ని దెబ్బతీస్తే ఊరుకునేది లేదని, ఆయన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని ఇప్పటికే స్పీకర్‌కు విన్నవించినట్లు తెలిపారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులపై కిషన్ రెడ్డి లాంటి నేతలు మౌనంగా ఉండటం సిగ్గుచేటని విమర్శించారు.కాంగ్రెస్ పార్టీదే మహిళా వికాస చరిత్రస్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీదేనని, దానిని పీవీ నరసింహారావు మరింత బలోపేతం చేశారని గుర్తుచేశారు. మహిళల ఆశలను రాజకీయ లాభాల కోసం వాడుకుంటున్న బీజేపీకి తెలంగాణలో ఓటు అడిగే హక్కే లేదని స్పష్టం చేశారు.పాల్గొన్న వారు:ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకటరామిరెడ్డి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కార్పొరేటర్లు మరియు కాంగ్రెస్ ముఖ్య నేతలు పాల్గొన్నారు.


## వైభవంగా భద్రకా భద్రేశ్వరుల బ్రహ్మోత్సవాల అంకురార్పణ

**జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**జర్మన్ పెండాల్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి**

**కనుల పండువగా గణపతి, సుబ్రహ్మణ్య సేవలు..**

**తరలివచ్చిన భక్తులు**







**ఏప్రిల్ 19 /ప్రజాదివాస్ ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో)**
ఓరుగల్లు నగర ఆరాధ్య దైవం, భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారం శ్రీ భద్రకాళీ భద్రేశ్వరుల బ్రహ్మోత్సవాలు ఆదివారం అత్యంత వైభవం గా ప్రారంభమయ్యాయి. నేటి నుండి ఈ నెల 30వ తేదీ వరకు జరిగే ఈ వార్షిక కళ్యాణ బ్రహ్మోత్సవాలకు ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు.

**శాస్త్రోక్తంగా వేడుకలు:**
ఉదయం 4 గంటలకే అమ్మవారికి నిత్యాహ్నికం నిర్వహించి, ఉత్సవాంగీకార ప్రార్థనతో వేడుకలు మొదలయ్యాయి. గణపతి పూజ, పుణ్యాహవాచనం, నాంది, బ్రహ్మకూర్చహోమం, వాస్తుయాగం,మృత్సంగ్రహణం వంటి విశేష క్రతువులను అర్చక బృందం నిర్వర్తించింది. అనంతరం ధ్వజాధివాస కార్యక్రమం నిర్వహించి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు.

**ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ప్రారంభం:**
వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను అధికారికం గా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆలయప్రాంగణం లో భక్తుల సౌకర్యార్థం ఎమ్మెల్సీ శ్రీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి మంజూరు చేసిన రూ. 10 లక్షల విరాళంతో నిర్మించిన అత్యాధునిక 'జర్మన్ పెండాల్స్'ను వారు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం నూతనంగా నిర్మించిన ధర్మకర్తల మండలి కార్యాలయాన్ని కూడా ఎమ్మెల్యే ప్రారంభించారు.

**భక్తిపారవశ్యంలో విశ్వబ్రాహ్మణ సంఘం:**
నేటి అంకురార్పణ కార్యక్రమానికి ఉమ్మడి వరంగల్ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు ఉభయ దాతలుగా వ్యవహరించారు. శ్రీ చొల్లేటి కృష్ణమాచారి నేతృత్వంలో వందలాది మంది మహిళలు మేళతాళాలతో పట్టు వస్త్రాలు, పూజా ద్రవ్యాలను అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ప్రతిపక్ష నాయకులు శ్రీ సిరికొండ మధుసూదనాచారి, మాజీ రిజిస్ట్రార్ డా. త్రిమూర్తుల గౌరిశంకర్, సంఘం అధ్యక్షులు డా. వేములవాడ మదన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

**సేవలు - సౌకర్యాలు:**
ఉదయం గణపతి సేవ, సాయంత్రం శ్రీ సుబ్రహ్మణ్య సేవలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సుబ్రహ్మణ్య సేవకు శ్రీ మాతంగి రమేష్ - డా. కృష్ణవేణి దంపతులు, శ్రీ గోవిందు నాగరాజు - శ్యామల దంపతుల సౌజన్యంతో మాదిగ కులస్తులు నిర్వహణ బాధ్యతలు చేపట్టారు. భక్తుల కోసం చలువ పందిళ్లు, మజ్జిగ, తాగునీరు మరియు ఉచిత ప్రసాద వితరణ ఏర్పాట్లు చేశారు.
ఈ ఏర్పాట్లను ఆలయ ఈఓ శ్రీమతి రామల సునీత స్వయంగా పర్యవేక్షించి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. రేపు (సోమవారం) ఉదయం 11 గంటలకు ధ్వజారోహణ కార్యక్రమంతో ఉత్సవాలు పూర్తిస్థాయిలో ఊపందుకోనున్నాయని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు కోరారు.

## డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టాలి: కాసాల వెంకట్ రెడ్డి



**అబ్దుల్లాపూర్ మెట్ -/ప్రజాదివాస్**
తెలంగాణలో విస్తరిస్తున్న డ్రగ్స్ సంస్కృతిని ఉక్కుపాదంతో అణచివేయాలని సమాచార హక్కు చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు కాసాల వెంకట్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం అబ్దుల్లాపూర్ మెట్టు మండల పరిధిలోని బాటసింగారంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో డ్రగ్స్ కల్చర్ 'పాము కింద చీమలా' నిశ్శబ్దంగా విస్తరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల స్థాయి వరకు ఈ డ్రగ్స్ భూతం పాకడం అత్యంత ఆందోళనకరమైన విషయమని, దీనివల్ల భావి భారత పౌరులుగా ఎదగాల్సిన విద్యార్థుల భవిష్యత్తు అంధకారమవుతోందని హెచ్చరించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఒక పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికతో డ్రగ్స్ రవాణా, వినియోగాన్ని పూర్తిస్థాయిలో నిర్మూలించాలని కోరారు.?డ్రగ్స్ కల్చర్ మూలంగా సమాజంలో అనేక దుష్పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని, పొరపాటున ఎవరైనా ఈ వ్యసనానికి అలవాటు పడితే వారి కుటుంబాలు రోడ్డున పడతాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వ్యక్తి మాదకద్రవ్యాలకు బానిసవ్వడం వల్ల ఆ కుటుంబం మొత్తం ఆర్థికంగా, సామాజికంగా కుంగిపోతుందని, అంధకారంలోకి నెట్టివేయబడుతుందని ప్రతి ఒక్కరూ గ్రహించాలని సూచించారు. యువత, విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, క్రమశిక్షణతో కూడిన మంచి మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం ప్రభుత్వ యంత్రాంగంతో పాటు పౌర సమాజం కూడా బాధ్యతగా వ్యవహరించాలని, ఈ మహమ్మారిని తుదముట్టించే వరకు అందరూ ఏకతాటిపైకి రావాలని కాసాల వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.